క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల దాడులు


పట్టుకున్న మద్యం, నిందితుడితో అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు సీఐ శ్రీనుబాబు తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఎ.పోలవరంలో నిర్వహించిన దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా తెలంగాణకు చెందిన ఎన్‌డీపీ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

టి.నరసాపురం: చింతలపూడి ఎక్సైజ్ అధికారులు శుక్రవారం మండలంలో దాడులు నిర్వహించారు. వెలగపాడు గ్రామంలో నిర్వహించిన దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై ఆర్‌వీఎల్ నరసింహారావు, హెచ్‌సీ పురుషోత్తం, కానిస్టేబుల్ సత్యనారాయణ, నస్రీన్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓలు

లింగపాలెం: పదో తరగతిలో వెనకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖ అధికారులు కంట రామారావు, జె.రవీంద్ర అన్నారు. మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలకు సంబంధించి 394 మంది విద్యార్థులకు శుక్రవారం విజయకేతనం స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పంచామృతాభిషేకాలు


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో నిర్వహించే దూప, దీప, నైవేద్యాల నిమిత్తం జంగారెడ్డిగూడేనికి చెందిన జి.శ్రీదేవి, దిలీప్‌కుమార్ రూ. 5,116 అందజేసినట్లు ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీ కృష్ణ, పద్మకుమారి దంపతులు తెలిపారు. వీరిని అమ్మవారి జ్ఞాపికతో సత్కరించారు. పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ కె.విజయ శర్మ నిర్వహించారు. అమ్మవారిని చోడవరపు రంగా జ్యోతి దంపతులు, లైటింగ్ శీను, బ్రహ్మం, దువ్వ రామకృష్ణ, యర్రా నాగేశ్వరావు, సత్య రామకృష్ణ అనురాధ దంపతులు దర్శించుకున్నారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ


నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి పంచామృతాభిషేకాలు, ఏకాదశ పూజలు, వేద దర్బారు సేవ, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ వారి వెండి చీర తయారీకి శీమకుర్తి కోటేశ్వరరావు వారి కుమారుడు శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు 10 తులాల వెండిని అమ్మవారి చీర నిమిత్తం అందజేశారని తెలిపారు. జనవరి 13వ తేదీ సోమవారం 71వ చండీ హోమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈ హోమంలో పాల్గొనే భక్తులు కమిటీ వారిని సంప్రదించి ఆలయ కార్యాలయం నందు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పట్టణ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 13 మందిని అరెస్టు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వారి నుంచి రూ.1,22,000 నగదు, 12 సెల్‌ఫోన్లు, నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

జీడి మామిడి.. సాగు తడబడి

- మెట్టలో జీడి తోటల కనుమరుగు
- సాగుకు రైతన్న నిరాసక్తత
- ఇప్పటికే వేలాది ఎకరాల్లో నిలిచిన సాగు


మెట్ట ప్రాంతంలో పూత పూసిన జీడి మామిడి తోట


జీడి చెట్లకు గుత్తులుగా కాసిన జీడి గింజలు

చింతలపూడి: ఒకకప్పుడు మెట్ట ప్రాంతంలో వేల ఎకరాల్లో సాగయ్యే జీడి మామిడి తోటలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. ఆశించిన స్థాయిలో పంట చేతికి రాక, వచ్చినా సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ ప్రాంతంలో పంట సాగుకు అనువైన వాతావరణం ఉన్నప్పటికీ రైతులకు సూచనలు అందించే వారు కరువవ్వడంతో ఏటేటా విస్తీర్ణం తగ్గుముఖం పడుతుంది. ఏటా మెట్ట రైతులకు కోట్లాది రూపాయల రాబడిని ఆర్జించి పెట్టిన జీడి మామిడి తోటలు ప్రస్తుతం అంతరించి పోతున్నాయి. ఏటా సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా ఒక ఏడాది లాభాలు వస్తే రెండేళ్లు నష్టాలను చవి చూసేవారు రైతులు. దీంతో గత పదేళ్లుగా జీడి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించారు. ముఖ్యంగా పామాయిల్, మొక్కజొన్న, వేరుశనగ, అరటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. అదీకాక మెట్ట ప్రాంతంలో భూగర్భ జలాల వినియోగం పెరిగాక వాణిజ్య పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చింతలపూడి సబ్ డివిజన్‌లో ఒకప్పుడు వేలాది ఎకరాల్లో విస్తరించిన జీడి తోటలు ప్రస్తుతం 2,000 హెక్టార్లకు చేరుకున్నాయి. గత కొన్నేళ్లుగా జీడి పిక్కల బస్తా 8 వేల రూపాయల నుంచి 10 వేల రూపాయల వరకు పలుకుతుంది. ఈ ఏడాది ఇంత వరకు ధర బయటికి రాలేదు. జీడి తోటల పెంపకం వల్ల రైతులకు రక రకాలుగా ఆదాయం లభిస్తుంది. మన ప్రాంతంలో రైతులు జీడి పిక్కలను మాత్రమే సేకరిస్తారు. జీడి పండ్లను చెట్ల క్రిందే వదిలేస్తారు. అదే ఇతర రాష్ట్రాల్లో అయితే అక్కడి రైతులు పండ్లను కూడా సేకరించి ఆదాయం పొందుతారు. వీటితో జామ్, పండ్ల రసాలు, తయారు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఏటా ఇక్కడి నుంచి కమీషన్‌దారులు లారీల్లో జీడి పిక్కలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.

రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



ప్రభుత్వం జీడితోటల పెంపకం చేపట్టే రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలి. ముఖ్యంగా రైతులు పండించిన జీడి పిక్కలను ప్రభుత్వమే గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి. జీడి పరిశ్రమ అభివృద్ధి కోసం అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.
–యర్రంశెట్టి రామకృష్ణారావు, రైతు, నామవరం

రేపు పిరమిడ్ ట్రస్టు శిక్షణ

జంగారెడ్డిగూడెం: స్థానిక పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 5న జీవితలక్ష్యం అనే అంశంపై ఒకరోజు శిక్షణను నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, కార్యదర్శి తటవర్తి కృష్ణ తెలిపారు. స్థానిక గౌరీ సుభద్ర పిరమిడ్ అనుబంధ మైత్రేయ మందిరంలో ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఏలూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్స్ మాజేటి శ్యామల, శేషగిరి రావు దంపతులు శిక్షకులుగా పాల్గొంటారన్నారు. సాత్విక శాఖాహార భోజనం ఏర్పాటు చేశామని, ప్రాధాన్యతా అంశాల నమోదుకు పాల్గొనే వారు పెన్ను, పుస్తకం తెచ్చుకోవాలని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

41వ కాంటూర్ నిర్వాసితులకు పరిహారం జమ

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలో ముంపునకు గురవుతున్న మండలంలోని ఎనిమిది గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం శుక్రవారం ఆర్అండ్ఆర్ పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసింది. గిరిజనేతర నిర్వాసితులకు 6,36,000, గిరిజన నిర్వాసితులకు 6,80,000 జమయ్యాయి. వీటితో పాటు స్ట్రక్చర్ ప్యాకేజీని కూడా నిర్వాసితుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

జైపాల్‌సింగ్ ముండా జయంతి వేడుకలు


నివాళులర్పిస్తున్న నేతలు

బుట్టాయగూడెం: మండలంలోని సింగన్నపల్లిలో రాజ్యాంగంలో 5, 6 షెడ్యూల్ ప్రదాత జైపాల్ సింగ్ ముండా జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జైపాల్ సింగ్‌ముండా చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గిరిజన ప్రాంతానికి చెందిన శాస్త్రవేత్తగా అమెరికాలో గిరిజనుల ఖ్యాతిని నిలిపిన కొవ్వాసి సూర్యప్రకాష్‌ను సన్మానించారు.

54 పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు


పశు వైద్య శిబిరంలో ఆవుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ద్వారకాతిరుమల: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా, పశుగణాభివృద్ధి సంస్థ (పెంటపాడు) ఆధ్వర్యంలో మండలంలోని ఎం.నాగులపల్లిలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామంలోని మినీ గోకులాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 54 పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించారు. అలాగే 45 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, పాడి పశువులకు లివర్ టానిక్, మినరల్ మిక్చర్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ టి.గోవిందరాజు, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ జేసురత్నం, భీమడోలు ఏడీ డాక్టర్ సాయి రమేష్, డాక్టర్ క్రాంతి కిరణ్, ద్వారకాతిరుమల మండల పశు వైద్యాధికారి అంగర సురేష్, డాక్టర్ రమేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన


కన్నాపురంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

కొయ్యలగూడెం: కన్నాపురంలోని యర్రాయిగూడెం రోడ్డు వాటర్ ట్యాంక్ సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఇటీవల ఆక్రమణదారులు భారీ వృక్షాలను అక్రమంగా నేల కూల్చారని దీనిపై తామంతా ఫిర్యాదు చేయగా అధికారులు సర్వే చేపట్టారన్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారులు అక్రమంగా చెట్లు నరికి వేయడంతో పాటు ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సర్వేలో వెల్లడైందన్నారు. అయితే చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకాడుతుండడం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. చలపతి వెంకటేశు, చరమళ్ల ధర్మరాజు, చలపర్తి రామారావు, మల్లం నాగరాజు, బోగోలు శ్రీను, పాలూరి లక్ష్మీనారాయణ, పుల్లా రామకృష్ణ, చెరమళ్ల మంగరాజు, కటూరి లక్ష్మయ్య, చరమళ్ల వెంకట రమణ, గుడిసే దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నియమాలు తెలుసుకోండి


ఘటనా స్థలంలో టూరిస్ట్ బస్సు, విద్యార్థులు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన కేశఖండనశాల సమీపంలో శుక్రవారం బస్ డ్రైవర్ మద్యం సేవించి, మాంసం తిన్నాడు. ఆలయ అధికారులు, సిబ్బంది బస్ డ్రైవర్‌ను మందలించి, ఆలయ నియమాలు తెలుసుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్‌కు చెందిన కొందరు విద్యార్థులు ఉదయం టూరిస్ట్ బస్సులో ద్వారకాతిరుమలకు వచ్చారు. కేశఖండన శాల పక్కనున్న ఖాళీ ప్రదేశంలో బస్సును నిలిపి, వంటలు చేసుకుంటున్నారు. ఆ సమయంలో బస్సు డ్రైవర్ అక్కడ మద్యం సేవిస్తూ, ఒక విద్యార్థి ఇంటి నుంచి తెచ్చుకున్న లంచ్ బాక్స్‌లోని మాంసాన్ని తీసుకుని ఆ డ్రైవర్ తింటున్నాడు. అక్కడున్న భక్తులు దీన్ని గమనించి డ్రైవర్‌ను నిలదీశారు. పవిత్రమైన క్షేత్రంలో మద్యం, మాంసం ఏమిటని ధ్వజమెత్తారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని బస్ డ్రైవర్‌ను మందలించారు. అయితే తమ ప్రాంతంలో ఆలయాల వద్ద మద్యం సేవించడం, మాంసం తినడం తప్పేమి కాదని, ఇక్కడ తినకూడదన్న నిబంధనలు తనకు తెలియదని సబ్ డ్రైవర్ చెప్పుకొచ్చాడు.

మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడికి సన్మానం


బొడ్డు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న కాపు సంఘం నాయకులు

చింతలపూడి: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్, నియోజకవర్గ కాపు నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావును వైఎస్సార్‌సీపీ ఏలూరు మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల చింతలపూడి కాపు సంఘం హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం బొడ్డు వెంకటేశ్వరావును కాపు నాయకులు ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని పదవులు ఎన్నో చేపట్టాలని ప్రజలకు మరెన్నో సేవలను అందించాలని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో చింతలపూడి కాపు నాయకులు కొత్తపూడి శేషగిరి రావు, తోట శివ నాగరాజు (నాని), ముత్యాల శ్రీనివాస్ (చిన్ని), తోట పూర్ణచంద్రరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ స్థల పరిశీలన


పడమర పాలకుంటలో ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బుట్టాయగూడెం: మండలంలోని పడమర పాలకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆట స్థలాన్ని తహసీల్దార్ పీవీ చలపతిరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల సమీపంలో ఉన్న ఆట స్థలాన్ని పరిశీలించామన్నారు. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకూ సుమారు 240 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వీరికి ఆట స్థలం లేదని జేసీ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారని చెప్పారు. దీంతో స్థల పరిశీలన చేయాలని జేసీ ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కూరం పద్మ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కె.అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి అవార్డు

జంగారెడ్డిగూడెం: అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, విశాఖపట్నం తరఫున జనవరి 3న సావిత్రిబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకుని, జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ గడ జగ్గారావును ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడుతూ గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల నందు నిర్వహించిన సభలో సావిత్రిబాయి పూలే విశిష్ట సేవా పురస్కారం –2025 ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఎంటీ కృష్ణబాబు చేతుల మీదుగా అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక తరఫున సమాజంలో మూఢ నమ్మకాలను పారద్రోలుతూ, శాస్త్రీయ దృక్పథాలను పెంపొందిస్తున్నందుకు ఆయనను సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపిక చేస్తూ పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సులో వినతుల స్వీకరణ


దొరమామిడిలో వినతులను స్వీకరిస్తున్న తహసీల్దార్

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడిలో శుక్రవారం సాయంత్రం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ పీవీ చలపతిరావు పలువురి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాములు, నాయకులు సోదెం మల్లయ్య, న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీవారి తిరువీధి సేవ


క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా చినవెంకన్న తిరువీధి సేవ క్షేత్ర పురవీధుల్లో శుక్రవారం ఉదయం అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారతులిచ్చారు. తరువాత ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామి వారి వాహనం తిరువీధి సేవకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నగర పంచాయతీ కార్మికుల ఆందోళన


నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

చింతలపూడి: ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ మాట్లాడుతూ 2023 డిసెంబర్‌లో చేసిన సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులను గుర్తించి వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని ప్రస్తుత ప్రభుత్వం జీవో రూపంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం కమిషనర్ పావనికి అందజేశారు. ధర్నాకు సీపీఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, ఎస్.సూర్యకుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టి.విజయ రాజు, కె.నాగరాజు, సత్యం, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

టి.నరసాపురం: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శ్రీరామవరానికి చెందిన గనిశెట్టి మణికంఠస్వామి జంగారెడ్డిగూడెం ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుకుంటూ ఖాళీ సమయాల్లో వ్యవసాయం పనులు చేస్తున్నాడన్నారు. మణికంఠ స్వామికి అప్పుడప్పుడు కడుపు నొప్పి రావడంతో మందులు వేసుకుంటున్నాడు. డిసెంబర్ 31వ తేదీన కడుపు నొప్పి తీవ్రంగా రావడంతో భరించలేక కలుపు మందు తాగాడు. గమనించిన తల్లి వెంటనే తన అల్లుడి సహాయంతో జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి మణికంఠస్వామిని తీసుకువెళ్లింది. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి గనిశెట్టి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే


చింతలపూడి: సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: పూలే జయంతి నిర్వహిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం: పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు

వాడవాడలా ఘనంగా జయంతి వేడుకలు

జంగారెడ్డిగూడెం: సావిత్రిబాయి పూలే చదువుల తల్లి అని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు.బుట్టాయగూడెం రోడ్ పెదరామాలయం పక్కనే ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అయినాల వెంకటరమణమూర్తి, నేకూరి కిషోర్, ఎల్ వీఆర్, బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, గెద్దాడ శీను, కంచర్ల విష్ణు, చింతకాయల అచ్చిరాజు, కంచుమర్తి ప్రకాష్, నడింపల్లి సత్యనారాయణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

చింతలపూడి: మహిళాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని చింతలపూడిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మానవ త ఆర్నేపల్లి అప్పారావు, మాజీ సర్పంచ్ ధర్మరాజు, పాల్గొన్నారు.

పూలే ఆశయాలు ఆదర్శనీయం

కొయ్యలగూడెం: సావిత్రిబాయి పూలే ఆశయాలు నేటి రాజకీయ పార్టీల నాయకులకు ఆదర్శనీయమని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగలు దుర్గారావు పేర్కొన్నారు. శుక్రవారం పరింపూడి బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం ఉమాదేవి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

కుక్కునూరు: మండలంలోని పెదరావిగూడెంలో సీపీఐ కుక్కునూరు మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేములపల్లి సాయిబు, సోడే యాకుబ్ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

కామవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, పి.ఏడుకొండలు పాల్గొన్నారు.